క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



మహబూబాబాద్ అర్బన్: స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ రకాల క్రీడల్లో రాష్ట్రస్థాయి పోటీలకు మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జి.ఉపేందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. వరంగల్‌లో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో డి.హారిక, బి.సతీష్, బాస్కెట్ బాల్‌లో రామ్‌దీక్షిత్, ఉర్సు, శ్రీచరణ్ ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను పీడీ సింధువర్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

దంతాలపల్లి: ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి ఆర్చరీ సెలక్షన్స్‌లో దంతాలపల్లి మండల స్థానిక అక్షర హైస్కూల్ విద్యార్థులు కుమారి, కీర్తన, కుమార్, ప్రజ్వల్ పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ సింగారపు యాకయ్య తెలిపారు. మంగళవారం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తిరునగరి శ్రీధర్, కోచ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా సత్యనారాయణ

గంగారం: గంగారం తహసీల్దార్‌గా సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రాము బదిలీపై హైదరాబాద్‌కు వెళ్లారు.

రుణమాఫీ చేయాలి

బయ్యారం: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ ఏఐపీకేఎస్, మాస్‌లైన్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఆర్‌ఐ నారాయణకు కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బిల్లకంటి సూర్యం, నాయకులు సత్యం, పూర్ణ, యాకయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సహజం

మహబూబాబాద్: ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజమేనని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కేసముద్రం: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యుడు బానోత్ సింహాద్రి అన్నారు. మంగళవారం సంఘం కార్యకర్తల సమావేశం చరణ్ అధ్యక్షతన జరిగింది. నవంబర్ 6న ఎస్‌ఎఫ్‌ఐ మండల మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, ధీరజ్, మోహన్, అభినయ్, యశ్వంత్, వీరన్న పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

గూడూరు: 5వ షెడ్యూల్ ఏజెన్సీ ప్రాంతాల్లో నెలకొన్న విద్య, నిరుద్యోగ సమస్యల పరిష్కారంతోపాటు ఆదివాసుల అభివృద్ధికి సహకరించాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్, కార్యదర్శి పడిగె నాగేశ్వర్‌రావు కోరారు. మండల కేంద్రంలోని సర్కిల్ పోలీసు స్టేషన్‌లో మంగళవారం సీఐ కె.బాబూరావు, ఎస్సై గిరిధర్‌రెడ్డిలను తుడుందెబ్బ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నాయకులు బొల్లి సారయ్య, ముఖర్జీ, కిరణ్‌కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

ఏఓను నిలదీసిన రైతులు

నర్సింహులపేట: అకాల వర్షంతో ఇటీవల దెబ్బతిన్న పంటపొలాలకు ప్రభుత్వం ఇస్తున్న పంట నష్టం పరిహారం అర్హత కలిగిన వారికి ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చారని ఏఓ వినయ్‌కుమార్‌ను మంగళవారం రైతులు నిలదీశారు. కార్యక్రమంలో రైతులు సురేష్, లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జాతీయ పురస్కారం ప్రదానం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రానికి చెందిన ఎంఎస్పీ జిల్లా అధ్యక్షురాలు ఎండి రజియాకు సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పురస్కారం దక్కింది. హోప్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గాన సభ ఆడిటోరియంలో అవార్డు అందజేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



గార్ల: టీబీ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సక్కుబాయి కోరారు. మంగళవారం మండలంలోని మర్రిగూడెం పల్లె దవాఖానలో టీబీ నిర్మూలన వాల్‌పోస్టర్లను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఇస్మాయిల్ బేగ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధి జరిగేనా?

- మార్కెట్ నూతన పాలకవర్గంపై రైతుల గంపెడు ఆశలు
- ధాన్యం కొనుగోళ్లపై ఎదురుచూపులు



తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

తొర్రూరు రూరల్: రెండేళ్లుగా అధికారుల పాలనలో ఉండి ఇటీవల కొత్తగా ఏర్పడిన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గంపై ఈ ప్రాంత రైతులు గంపెడు ఆశలతో ఉన్నారు. అనేక రకాల ధాన్యం కొనుగోళ్లలో దినదినం కేసముద్రం, మానుకోట, వరంగల్ వంటి చుట్టు ఉన్న మార్కెట్లు ఎంతో అభివృద్ధి చెందుతున్న తొర్రూరు మార్కెట్ మాత్రం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రధానంగా తొర్రూరులో విద్యా, వైద్యం, వ్యాపార, వాణిజ్యం వంటి అనేక రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందుతున్న, వ్యవసాయ మార్కెట్‌లో మాత్రం ఎలాంటి కొనుగోళ్ల లేక అభివృద్ధిలో పూర్తిగా వెనుకబడి ఉంది. కేవలం మార్కెట్ పరిధిలో తొర్రూరు, దంతాలపల్లిలో ఉన్న రెండు చెక్ పోస్టుల ద్వారా వచ్చే ఆదాయం తప్ప, మార్కెట్‌కు ఎలాంటి ఆదాయం లేకపోవడంతో నిరుపయోగంగా మారడంతోపాటు అందులో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులకు సైతం సరిపడా పని భారం లేక ప్రతినెల జీతాలు తీసుకుంటూ కాలన్ని వెళ్లదిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

ఇబ్బందులు పడుతున్నారు..

కొత్తగా ఏర్పడిన పాలకవర్గమైన స్పందించి మార్కెట్‌లో పత్తి, మిర్చి, మక్కలు, పెసర, కందులు వంటి కొనుగోళ్ల ప్రారంభిస్తారేమోనని రైతులు ఎదురు చూస్తున్నారు. మార్కెట్‌లో ధాన్యాన్ని నిల్వ చేసేందుకు సరిపడా గోదాంలు ఉండగా, విశాలమైన గ్రౌండ్ ఉండగా మార్కెట్‌లో మాత్రం ఎలాంటి కొనుగోళ్లు జరగకపోవడంతో దిక్కులేని స్థితిలో రైతులు తమ ధాన్యాన్ని ఇతర మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయిస్తూ నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కొత్త పాలకవర్గమైన స్పందించి మార్కెట్‌లో అన్నిరకాల కొనుగోళ్లను ప్రారంభించి, మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసే తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

అభివృద్ధి చేస్తా..



మార్కెట్‌లో అన్నిరకాల ధాన్యాన్ని కొనుగోళ్లు చేపట్టే విధంగా కృషి చేస్తా. నిత్యం రైతులకు అందుబాటులోకి ఉంటా. త్వరలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత స్థానిక ఎమ్మెల్యేల సహకారంతో మార్కెట్ ఉన్నత స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేస్తా.

– హనుమాండ్ల తిరుపతిరెడ్డి, మార్కెట్ చైర్మన్, తొర్రూరు

వైద్యరంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడ: వైద్యరంగం బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడలో మంగళవారం ఆయన ప్రభుత్వ ఆస్పత్రితోపాటు పలు ప్రాంతాలు తిరిగి అభివృద్ధి పనులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమన్నారు. ఖజాన లేమితో పనులు కొంత నిలిచిపోయాయని త్వరలోనే ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటుందన్నారు. తెగిన రోడ్లు, చెరువులను వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ మహబూబాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, డివిజన్ కార్యదర్శి ముంజపల్లి వీరన్న, నాయకులు తిమ్మిడి హనుమంతరావు, బండపల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట నాయకులు రఘువీరారెడ్డి, తాజుద్దీన్, శ్రీపాల్‌రెడ్డి, నరేష్‌రెడ్డి తదితరులున్నారు.

బస్సు సర్వీసులు కొనసాగించాలి



బస్ ఎదుట ధర్నా చేస్తున్న యువకులు

మరిపెడ రూరల్: మండలంలోని గిరిపురం ఎక్స్ రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్ సర్వీసులు కొనసాగించాలని గిరిపురం గ్రామ యువకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సూర్యాపేట 365 జాతీయ రహదారిపై బస్‌ను అడ్డగించి యువకులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ.. చాలా సంవత్సరాలుగా ఆర్టీసీ బస్సుల సర్వీసులు గిరిపురం ఎక్స్ రోడ్డు మీదుగానే కొనసాగుతున్నట్లు తెలిపారు. కానీ రెండు నెలలుగా గిరిపురం క్రాస్ రోడ్డుకు రాకుండానే హైవేపై బైపాస్‌లో వెలుతుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సూర్యాపేట డిపో మేనేజర్‌తో ఫోన్‌లో యువకులు మాట్లాడగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో యువకులు పట్ల వంశీ, బాదావత్ జనార్దన్, సైదులు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

మూడు వాయిదాల్లో డీఏ ప్రకటించాలి



మాట్లాడుతున్న హరినాయక్

మహబూబాబాద్ అర్బన్: ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు వాయిదాల్లో డీఏలను తక్షణమే ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు బానోత్ హరినాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడుతూ.. కెబినెట్ నిర్ణయాలపై ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్ బిల్స్, మెడికల్ బిల్స్, పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల బిల్స్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కోటూరు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు మేకల కుమార్, కోశాధికారి ఎస్.నాగేశ్వర్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహబూబాబాద్: పెండింగ్‌లో ఉన్న ట్రైకార్ సబ్సిడీ రుణాల నిధులను వెంటనే విడుదల చేయాలని తెలంగాణ గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ రవీందర్ డిమాండ్ చేశాడు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. రుణాలు మంజూరు కాకపోవడంతో గిరిజనులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. గత ప్రభుత్వం గిరిజనులకు తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రభుత్వం గిరిజనుల ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలోదారావత్ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయులను సన్మానించిన ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దటంలో, సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. డీఎస్సీ ద్వారా మండలంలోని కంబాలపల్లి గ్రామానికి చెందిన 12మంది ఉపాధ్యాయులుగా ఎంపికైన నేపథ్యంలో మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రామసహాయం శ్రీధర్ రెడ్డి, వీరస్వామి, హెచ్‌ఎం రమేష్ బాబు, రామయ్య పాల్గొన్నారు.

విధుల్లో ఇంత నిర్లక్ష్యమా?

కొత్తగూడ: 'పంచాయతీరాజ్, ఐటీడీఏ పర్యవేక్షణలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించిన రికార్డులు సామాజిక తనిఖీ సిబ్బందికి ఇవ్వరు, ప్రజావేదికకు హాజరు కారా? ఇంత నిర్లక్ష్యమా' అని పీఆర్, ఐటీడీఏ ఏఈలపై అదనపు డీఆర్‌డీఓ శాంత కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రెండో రోజు జరిగిన ప్రజావేదికలో ఆమె మాట్లాడారు. గ్రామాల వారిగా గుర్తించిన అవకతవకలకు ఈజీఎస్ సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శులకు జరిమానా విధించారు. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో పోయిన మొక్కల స్థానంలో నూతనంగా మొక్కలను కాంట్రాక్టర్ చేత నాటించాలని, లేదంటే వాల్టా చట్టం ఉపయోగిస్తామని హెచ్చరించారు. 24 గ్రామ పంచాయతీల్లో రూ.17,80,195 అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ సిబ్బంది గుర్తించారు.

చెరువు కట్ట పునర్నిర్మాణ పనులు చేపట్టాలి

మహబూబాబాద్ రూరల్: అకాల వర్షాలు, వరదల కారణంగా తెగిన మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామపెద్ద చెరువు కట్ట పునర్నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి సురుగు ఐలయ్య అన్నారు. మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామ పెద్ద చెరువు కట్ట తెగిన ప్రాంతంలో మంగళవారం ఐలయ్య మాట్లాడారు.

సెల్‌ఫోన్ అప్పగింత

గార్ల: గార్లకు చెందిన గాడేపల్లి రాజేష్ స్థానిక గాంధీ పార్క్ వద్ద సోమవారం సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి మంగళవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు.

చర్య తీసుకోవాలి

కొత్తగూడ: పనులు చేయకుండా బిల్లులు చేసిన అధికారులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు మండల కేంద్రంలో రోడ్డుపై బైటాయించి ధర్నా చేశారు. ఈసందర్భంగా జిల్లా ఓడీసీఎంఎస్ వైస్ చైర్మన్ దేశిడి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధి హామీ ద్వారా మంజూరైన సీసీ రోడ్లకు సంబంధించి పంచాయతీ రాజ్ ఏఈ కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై పనులు చేయకుండానే బిల్లులు చేశాడని ఆరోపించారు. నాయకులు వేణు, నెహ్రూ, సంతోషారాణి పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

అగ్నిప్రమాదాలపై అవగాహన

డోర్నకల్: దీపావళి సందర్భంగా బాణసంచా కాల్చే సమయంలో జాగ్రత్తలు పాటించాలని డోర్నకల్ ఫైర్‌స్టేషన్ అధికారి ఎన్.వీరేష్ సూచించాడు. స్థానిక బైపాస్ రోడ్డులోని బాణసంచా దుకాణాల వద్ద అగ్నిప్రమాదాల నివారణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

జాగ్రత్తగా ఉండాలి

మహబూబాబాద్ రూరల్: దీపావళి సెలవుల్లో ఊళ్లకు వెళ్లే ప్రజలు జాగ్రత్తలు పాటించాలని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ అన్నారు. దొంగతనాల నివారణకు ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ దేవేందర్ మంగళవారం పట్టణ ప్రజలకు పలు సూచనలు చేశారు.

మిరప తోట పరిశీలన

నర్సింహులపేట: మిరప తోటలో సమయానికి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ వినయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గల మిరప తోటలను ఆయన పరిశీలించారు. మిరపలో మోతాదుగా మించి ఎరువులు వేయకూడదని సూచించారు.

ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం

మరిపెడ/మరిపెడ రూరల్: మండల కేంద్రంలోని కనకదుర్గ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం గౌడ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించుకున్నారు. అనంతరం కౌండిల్య పరపతి సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దోమల లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిమల్ల శరత్‌చంద్ర, కోశాధికారిగా గండి కర్ణాకర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గౌడ ఉద్యోగుల సమన్వయ కర్త లింగాల మహేష్‌గౌడ్, శ్రీకాంత్ గౌడ్, యాకయ్య, సత్యశ్రీనివాస్ పాల్గొన్నారు.

సేవలను మరింత విస్తృత పర్చాలి

మహబూబాబాద్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సేవలను మరింత విస్తృతం చేయాలని ఐఎంఏ మానుకోట శాఖ అధ్యక్షుడు డాక్టర్ బి.నెహ్రూ అన్నారు. మానుకోటకు చెందిన డాక్టర్ రూప్‌లాల్‌కు ఐఎంఏ రాష్ట్ర కమిటీ జోన్ 3లో రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా అవకాశం మంగళవారం రూప్‌లాల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సురేందర్, వైదేహి, దేవి రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కురవి: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ అన్నారు. మంగళవారం మండలంలోని తట్టుపల్లి గ్రామంలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రవీణ్‌కుమార్, మంజుల, బాబు పాల్గొన్నారు.

సన్మానం



డోర్నకల్: డోర్నకల్‌తోపాటు మరో ఏడు మండలాలకు ఏడున్నర సంవత్సరాలుగా ఎంఈఓగా విధులు నిర్వహించిన పూల్‌చంద్‌ను మంగళవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డి.ప్రభుదాస్, జిల్లా కార్యదర్శి శ్రీధర్, కృష్ణారెడ్డి, వెంపటి సీతారాములు పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారయత్నం?

నెల్లికుదురు: ఓ మహిళపై అత్యాచారయత్నం జరిగిన సంఘటన మండలంలోని రామన్నగూడెం గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఓ మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సదరు వ్యక్తిపై ఎస్సై కేసు నమోదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

నెల్లికుదురు: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బానోతు నందీశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మంగళవారం తహసీల్దార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మన్విత్, సురేందర్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

గార్ల: ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నవంబర్ 5, 6 తేదీల్లో నిర్వహించే గిరిజన సమ్మేళనం జయప్రదం చేయాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి భూక్యా హరి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పూల్‌సింగ్, రున్‌వాల్ రాజేశ్, లకావత్ శ్రీను, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం

మరిపెడ రూరల్: పోలీస్ అమరవీరుల సంస్మరణలో భాగంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో తొర్రూరు పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో డివిజన్ స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. మండలానికి చెందిన యువకులు శ్రీను, చందు ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతులను గెలుచుకున్నారు. విజేతలకు తొర్రూరు డీఎస్పీ టి.కృష్ణ కిశోర్ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు.

క్రికెట్ టోర్నమెంట్

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని ఈదులపూసపల్లి ఒకటో వార్డులో వెన్నం సత్యనారాయణరెడ్డి సుజాత జ్ఞాపకార్థ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ వెన్నం లక్ష్మారెడ్డి, వెన్నం చంద్రకర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

హడావుడిగా సీసీ రోడ్డు నిర్మాణం



కొత్తగూడ: పనులు చేయకుండానే బిల్లులు డ్రా చేశారని సామాజిక తనిఖీ సిబ్బంది గుర్తించడంతో మంగళవారం కాంట్రాక్టర్ హడావుడిగా చంద్రుతండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాడు. పనులు చేయకుండా బిల్లులు ఇచ్చిన అధికారులపై చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కంటి వైద్యశిబిరం

తొర్రూరు రూరల్: మండలంలోని చెర్లపాలెం గ్రామంలోని ఉన్నత పాఠశాలలో మహేష్ ఆప్టికల్స్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం తనూజ, వైద్యుడు మహేష్, రామచంద్రు, పూర్ణచందర్, రాజు, అశోక్ పాల్గొన్నారు.

విశ్రాంత డిప్యూటీ డీఈఓ మృతి

గార్ల: మండలంలోని పెద్దకిష్టాపురం గ్రామానికి చెందిన విశ్రాంత డిప్యూటీ డీఈఓ గంగావత్ హనుమంతు (64) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. పలువురు సంతాపం తెలిపారు.

ఏఈఓలను విధుల్లోకి తీసుకోవాలి



మరిపెడ రూరల్: నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఏఈఓలు

మరిపెడ రూరల్: డిజిటల్ క్రాప్ సర్వేను బైకాట్ చేసినందుకు ఇటీవల అకారణంగా రాష్ట్ర వ్యాప్తంగా ఏఈఓలను సస్పెన్షన్ చేశారని, వెంటనే వారిపై సస్పెన్షన్‌ను ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని మరిపెడ ఏఈఓలు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం గిరిపురం రైతువేదికలో రైతునేస్తం కార్యక్రమంలో నల్లబ్యాడ్జీలు ధరించి కింద కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఈఓలు సైదమ్మ, శ్వేత, శృతి, స్రవంతి, శ్రీకాంత్, రాజేంద్రప్రసాద్, అన్వేష్, సందీప్ పాల్గొన్నారు.

ఏఈఓలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వం ఏఈఓలపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేయాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు సాయిప్రకాష్, రంజిత్, పున్నమి, సరిత, షాహిన, లావణ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం జరిగిన రైతునేస్తం కార్యక్రమంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నేలపై కూర్చుని నిరసన తెలిపారు.

నెల్లికుదురు: ఏఈఓలపై సస్పెన్షన్ వేటును ఎత్తివేయాలని కోరుతూ స్థానిక రైతువేదికలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఏఈఓలు ప్రవీణ్, రవి, మణికంట, కల్యాణి పాల్గొన్నారు.

మత్స్యకారులు ఆర్థికంగా బలోపేతం కావాలి

- ఎమ్మెల్యే మురళీనాయక్



చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

నెహ్రూసెంటర్: మత్స్యకారుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కంబాల చెరువులో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత చేప పిల్లలను చెరువులో మంగళవారం వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మానుకోట నియోజకవర్గంలోని మత్స్యకారులు, వారి కుటుంబాలు ఉచిత చేప పిల్లల పెంపకం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని సూచించారు. అన్నిరకాల చేపలను చెరువులో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి బానోత్ వీరన్న, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, ఎండి ఖలీల్, నాళ్ల నరసింహారావు, పెద్ది సైదులు, శంతన్ రామరాజు, శివ, ఎడ్ల రమేష్, గోనే శ్యాం, తదితరులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదులు నిర్మించాలి

మండలంలోని కంబాలపల్లి ప్రాథమిక పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం చర్య తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌కు మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు రవి, రాధిక, సువర్ణ, కవిత, శ్రీజ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని ఆందోళన

చిన్నగూడూరు: న్యాయం చేయాలంటూ ఉగ్గంపల్లి గ్రామానికి చెందిన బాధితులు పోలీస్ స్టేషన్ ఎదుట పురుగుల మందుతో ఆందోళన చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉగ్గంపల్లి గ్రామంలో దసరా పండుగ రోజున తమపై కత్తులు, గొడ్డళ్లతో దాడులు చేయగా బీసు రమేష్, దుస్స వెంకన్నలకు తీవ్రగాయాలు అయ్యాయని తెలిపారు. దాడి చేసిన వారిని వదిలేసి, గాయపడిన వ్యక్తులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం అన్యాయమని బాధితులు వాపోతున్నారు. నాలుగు రోజుల్లో మిగతావారిని కూడా పట్టుకుని రిమాండ్‌కు తరలిస్తామని ఎస్సై రఘూన్సీ తెలపడంతో బాధితులు ఆందోళన విరమించారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

గార్ల: మండలంలోని కొత్తపోచారం గ్రామానికి చెందిన నల్లగంటి సత్యం(70)కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య రమణమ్మ కూతుళ్ల ఇళ్లకు వెళ్లి నెలల తరబడి ఇంటికి రాకపోవడంతో మృతుడు మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో ఇంట్లో ఉన్న పురుగుమందు తాగాడు. చుట్టు పక్కల వారు సత్యంను గార్ల సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ



పంపిణీ చేసిన సైకిళ్లతో విద్యార్థులు

గూడూరు: మండలంలోని తీగలవేణి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 41 మంది విద్యార్థులకు మంగళవారం అదే గ్రామ శివారులోని మిడ్‌వెస్ట్ గ్రానైట్ లిమిటెడ్ సంస్థ వారు నూతన సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మిడ్‌వెస్ట్ జీఎం మూల వినయందర్‌రెడ్డి, అకౌంట్ మేనేజర్ గౌండ్ల మల్లయ్య, హెచ్‌ఆర్ రామకృష్ణ, హెచ్‌ఎం ఫారూఖ్, ఉపాధ్యాయులు పురుషోత్తం, సంపత్, ధర్మ, సాంబయ్య, నాగరత్న, రాంప్రసాద్, రవి, రఫీ, లక్ష్మయ్య పాల్గొన్నారు.